# ఆ బంగ్లాలో...

- అనీలజ




**ఆకాశం మబ్బు పట్టి ఉంది. చల్లగా ఉంది. సాయంత్రం అయిదు గంటల వేళ. హాయిగా ఉంది. కారులో ప్రయాణిస్తోంటే...ఎంత దూరమయినా ఇలా ఒంటరిగా ప్రయాణించాలనిపిస్తోంది. రేపు సెలవయితే ఈ రోజు అదే పని చేసేవాణ్ణి. కాని సెలవు కాదే! ఈరోజు కూడా సెలవు కాదు. పైగా ఇదో అసైన్ మెంట్ నెత్తిన పెట్టుకుని పరిగెడుతున్నాను.**



ఊరికి ఉత్తరాన ఓ పాడుబడిన భవంతి ఉంది. భూత్ బంగ్లా. ఈ దేశాన్ని బ్రిటీషు వాళ్ళు పాలిస్తున్నప్పుడు అందులో పెద్ద పెద్ద ఆఫీసర్లు కుటుంబసమేతంగా ఉండేవారట! మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వాళ్ళు వెళ్ళిపోవడంతో...అప్పట్నుంచి ఆ బంగ్లా ఖాళీగా ఉంటోంది. పాడుబడి, సగం కూలిపోయి దిక్కులేని దివాణంలా తయారయింది. అందులో దెయ్యాలు తిరుగుతున్నాయని ప్రచారం. ఓ దినపత్రిక స్పష్టాస్పష్టంగా అక్కడి దెయ్యాల ఫోటోలు ప్రచురించింది. ఆ ఫోటోలనే ఓ న్యూస్ చానల్ కూడా చూపించి 'దెయ్యాలోచ్ దెయ్యాలు' అని గొంతు చించుకుంది. దాంతో మా పేపర్ వాళ్ళు ఊరుకుంటారా? ధైర్యం, స్థయిర్యం కలిగిన నన్ను పిలిచి–

''అదేంటో చూడవయ్యా! ఆ బంగ్లాలో దెయ్యాలు ఉన్నాయట'' అని చెప్పారు. 'సరే సార్' అని బయల్దేరాను. దెయ్యాలా? పాడా? అక్కడేదో సంఘ వ్యతిరేక కార్యక్రమాలు నడుస్తున్నట్టున్నాయి. అవి బయటికి పొక్కకుండా దెయ్యాలను అడ్డుపెట్టుకున్నారు వాళ్ళు. ఆ సంగతి నేను తేల్చాలి. తేల్చేస్తే మా ఎడిటర్గారికి అదో తుత్తి! నవ్వొచ్చింది. నవ్వుకుంటూ ఉండగానో బంగ్లా దగ్గరికి వచ్చింది. కారాపి దిగాను. బంగ్లాను చూస్తోంటే నిజంగానే భయంగా ఉంది. గోడల్లోంచి మొక్కలూ, లతలు తన్నుకొచ్చి విచిత్రంగా ఉందది. నాచుపట్టి నీరుకారుతూ ఉంది. ఊరుకి దూరంగా పెద్ద పెద్ద చెట్ల మధ్య ఆ బంగ్లా అడవిలో ఉన్నట్టుగా ఉంది. ధైర్యంగా ముందుకు నడిచాను. పేరుకి మాత్రమే గేటులా ఉన్న విరిగి ఒరిగిపోయిన అంతెత్తు కర్ర తలుపుల్ని తీసుకుని లోపలికి ప్రవేశించాను. లోపల ఎవరూ లేరు. కింద హాలులో నిలుచుని చూస్తే పై అంతస్తులో కూడా ఎవరూ కనిపించలేదు. కాకపోతే పెద్ద పెద్ద సాలెగూళ్ళూ, అయిదారు గబ్బిలాలు కనిపించాయి. పై అంతస్తుకి చేరేందుకు కర్రమెట్లున్నాయి. మేడమెట్లన్న మాట! విరిగిపోయి చెదలు పట్టి ఉన్నాయవి. వాటి మీంచే నడవాలి. తప్పదు. నడిచాను. ఎంత జాగ్రత్తగా నడిచినా పడతానేమో అనిపిస్తోంది. ఇంతలో ఎవరినో ఎవరో తరుముతున్నట్టనిపించింది. పరుగులుదీస్తున్న శబ్దం వినిపించింది. అటు ఇటు... ఇటు అటు... ఎటు పడితే అటు తలతిప్పి చూశాను. పందికొక్కును పిల్లి తరుముతోంది. పోటాపోటీగా పరుగు దీస్తున్నాయవి.

'ఇదా' అని ఊపిరి తీసుకున్నాను. వాచీ చూసుకున్నాను. అయిదు గంటల ఇరవై నిముషాలయింది. అయినా లోపల చీకటిగా లేదు. రంధ్రాలు రంధ్రాలుగా ఉన్న పైకప్పులోంచి ఆకాశాన్ని చూశాను. వెలుతురుతో మెరిసిపోతోంది. మబ్బులు విడిపోయుంటాయనిపించింది. పైకి చేరుకుని సిగరెట్ ముట్టించాను. పరిశీలనగా చూడసాగాను. ఎక్కడా ఎలాంటి అలికిడీ లేదు. ఓ గోడకి మాత్రం వర్షంలో సెక్సీగా తడుస్తోన్న త్రిష పోస్టర్ అంటించి ఉంది. ఆమె నడుము చుట్టూ చేతులు వేసిన హీరో చేతులు ఉన్నాయి కాని, హీరో మొహం లేదు. చింపేశారెవరో. పోస్టర్ని చేత్తో తడిమి చూస్తూ అప్రయత్నంగా ఇటు గోడకేసి చూశాను. గోడ మీద ఎవరిదో నీడ! గుండె గొల్లుమంది.

''ఎవరు? ఎవరది'' గట్టిగా అరిచాను. సమాధానం లేదు. ఒకడుగు ముందుకేసి–

''చెప్పండి! ఎవరది? ఎవరక్కడ'' మళ్ళీ అరి

## అతి చిన్న హారర్ స్టోరీ

ఆ ఇంట్లో ఒంటరిగా కూర్చుని ఉందామె. ఈ ప్రపంచంలో తానొక్కతే బతికి ఉందన్న సంగతి తెలుసుకుని ఏడుస్తోంది. గత రాత్రే అన్నీ... అందరు చనిపోయారు. అయితే చిత్రంగా ఆ ఇంటి కాలింగ్ బెల్ మోగుతోంది.

చాను. సమాధానం లేదు. గోడ మీద నీడ కూడా లేదు. ఉక్కపోస్తున్నట్టనిపించి, సన్నగా చెమటలు పట్టసాగాయి. నుదుటి మీది చెమటను తుడుచు కుంటూ మళ్ళీ యథాస్థానంలోకి వచ్చి చూస్తే... గోడ మీద మళ్ళీ నీడ! భయపడకుండా అరవ కుండా చూశాను. పరిశీలనగా చూశాను. ఆ నీడ నాదే! 'హమ్మయ్య' అనిపించింది. నవ్వొచ్చింది. పగలబడి నవ్వుకున్నాను. నా నవ్వు ఆ బంగ్లాలో ప్రతిధ్వనించింది. నేను నిలుచున్న చోట నాకు కుడి వైపున వరుసగా నాలుగైదు గదులున్నాయి. ఏ గదికీ ద్వారం లేదు. ద్వారాలు దొంగిలించుకు పోయారేమో! కోసినట్టుగా గోడలు మొండిగా కనిపిస్తున్నాయి. ఓ గదిలోకి నడిచాను. ఆ గదిలో ఓ మూలగా కుక్క ఒకటి పడుకుని కనిపించింది. నా అలికిడికి మోర ఎత్తిపెట్టి చూసి, అంతలోనే మళ్ళీ పడుకుంది. గోడల మీద కిళ్ళీ ఉమిసిన గుర్తులు...రక్తం కక్కుకున్నట్టుగా ఉన్నాయి. పరిశీలనగా చూస్తూ ముందుకు నడుస్తున్నాను. రెండడుగుల దూరంలో అంతా చీకటిగా ఉంది. వెలుతురు లేదక్కడ. ఒక్క క్షణం ఆగాను. ఆ చీకట్లోకి వెళ్ళాలా? వద్దా? అని ఆలోచించాను. వద్దని నా మనసు చెబుతున్నా వెళ్ళమన్నట్టుగా ఎవరో నన్ను బలవంతం చేస్తున్నట్టుగా అనిపించడంతో చీకట్లోకి నడిచాను. కొంత వరకు గోడను పట్టుకుని నడిచాను. తర్వాత కాలి కింద మెత్తగా ఏదో తగలడంతో గోడను వదిలి ఇటుగా గెంతాను. కాలికి మెత్తగా తగిలిందికాని, కంటికేదీ కనిపించడం లేదు. అంతా గాఢాంధకారం. తడిమి చూస్తే గోడ కూడా చేతికందట్లేదు. ఎక్కడ ఉన్నానో తెలియని స్థితి. ఎటు నడిస్తే ఏమవుతుందోనన్న ఆందోళన. గట్టిగా అరుద్దామనుకున్నాను. అంతే! నా గొంతెవరో నొక్కేశారు. నా గొంతు చుట్టూ చేతులు బిగుసుకున్నాయి.

*

